# నూతన పెన్షన్ స్కీం రద్దు చేయాలి!
# పాత పెన్షన్ విధానం అమలు చేయాలి!!

## సిపియస్ విధానానికి నిరసనగా ర్యాలీ, సదస్సు

**జూన్ 19**
**విజయవాడ**

**"పెన్షన్ అనేది ఉద్యోగుల హక్కు. యజమాని తన ఇష్ట ప్రకారం ఇచ్చే దయా ధర్మంగానీ, బిక్షంగానీ కాదు".**

ఇది సుప్రీంకోర్టు ధర్మాసనం 17.12.1982 తేదీన కేంద్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఇచ్చిన తీర్పు.

కోర్టుల మీద, ప్రజల హక్కుల మీద ఏ మాత్రం గౌరవంలేని పాలక పార్టీలు కోట్లాది మంది ఉద్యోగుల, ఉపాధ్యాయుల, కార్మికుల జీవితాలను దెబ్బకొట్టాయి.

ట్రిపుల్ బెనిఫిట్ పెన్షన్ స్కీం రావడానికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి సాధించారు.

ప్రపంచబ్యాంకు ఆదేశాలతో, ఆర్థిక సంస్కరణలు అమలుకు తలొగ్గిన మన పాలకులు పి.ఎఫ్.ఆర్.డి.ఏ బిల్లు ద్వారా నూతన పెన్షన్ పథకం అమలులోకి తెచ్చారు.

సామాజిక బాధ్యతగా పెన్షన్ చెల్లించాల్సిన ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పుకుంది. ఉద్యోగుల జీతాల్లో 10శాతం వాటాతో ప్రభుత్వ వాటా జమ చేసి మొత్తం సొమ్ము కార్పొరేట్ వర్గాల వ్యాపార ప్రయోజనాల కొరకు షేర్ మార్కెట్‌లో పెట్టి ఉద్యోగుల, ఉపాధ్యాయుల జీవితాలు బలి పెట్టింది.

2004 జనవరి 1నుండి కేంద్రంలో, సెప్టెంబర్ 1నుండి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంట్రిబ్యూటరీ పెన్షన్ అమలులోకి తెచ్చారు. ఉద్యోగుల పాలిట శాపమైన పిఎఫ్ఆర్‌డిఏ బిల్లును ఎన్.డి.ఏ (బిజెపి), యుపిఏ(కాంగ్రెసు) పార్టీలు పలుమార్లు పార్లమెంట్లో ప్రవేశ పెట్టగా వామపక్షాలు తప్ప పాలక, ప్రతిపక్షాలతో పాటు దాదాపు అన్ని పార్టీలు ఆమోదించాయి. 2013 సెప్టెంబర్ 4న లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందినప్పటికీ పాలక పార్టీల వైఖరి వల్ల 2004నుంచే అమలులోకి వచ్చింది.

ఫలితంగా 2004 తర్వాత నియామకం పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రధానంగా గ్రాట్యుటీ, కమ్యుటేషన్, కుటుంబ పెన్షన్, పిఎఫ్ తదితర సౌకర్యాలు కోల్పోయారు.

కేంద్ర ప్రభుత్వంలో 15,89,110మంది, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో 28,18,740 మంది సిపిఎస్ పథకం పరిధిలోకి వెళ్ళారు. ఆంధ్రప్రదేశ్‌లో 1,56,702మంది, తెలంగాణ లో 1,11,942మంది సిపిఎస్‌లో ఉన్నారు.

పథకం అమలులో సైతం అనేక లోపాలు ఉన్నాయి. ప్రభుత్వ వాటా సక్రమంగా జమ కావడం లేదు. ఉద్యోగుల జీతాల నుండి 10శాతం చెల్లించినా రిటైర్ అయిన తర్వాత ఎంత పెన్షన్ వస్తుందో గ్యారెంటీ లేదు. కనీస భద్రత లేని ఈ పథకం పట్ల ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

నూతన పెన్షన్ పథకాన్ని రద్దు చేయాలని గత దశాబ్దకాలంగా అనేక పోరాటాలు దేశంలో, రాష్ట్రంలో జరిగాయి. కార్పొరేట్ కనుసన్నల్లో పరిపాలన చేస్తున్న పాలక పార్టీల విధానంలో మార్పురాలేదు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్నవారు మరింత వేగంగా సంస్కరణలు అమలు చేస్తామని పదే పదే ప్రకటిస్తున్నారు. ఫ్రెండ్లీ  ప్రభుత్వం అంటూ ఉద్యోగుల హక్కులు  కాలరాస్తున్నారు.

దేశవ్యాప్తంగా పోరాటాలు కొనసాగుతున్నాయి. రైల్వే ఉద్యోగులు సమ్మెకు సిద్ధం అయినారు. కేంద్ర కార్మిక సంఘాలు సెప్టెంబర్ 2వ తేదీన అఖిల భారత సమ్మెకు పిలుపునిచ్చాయి. బ్యాంకు, ఎల్ఐసి ఉద్యోగ సంఘాలు జత కలిసాయి. మన రాష్ట్రంలో కూడా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఈ పోరాటంలో భాగస్వామ్యం కావాలి.

దేశంలో నూతన పెన్షన్ విధానం అమలు చేసినప్పటికి (ఆనాటికి) వామపక్షాలు అధికారంలో ఉన్న పశ్చిమబెంగాల్, కేరళ, త్రిపుర రాష్ట్రాల శాసన సభల్లో పాత పెన్షన్ కొనసాగిస్తూ చట్టం చేసి ఉద్యోగుల, ఉపాధ్యాయుల పక్షాన నిలిచారు.

శాసనసభలో చట్టం చేసి సిపిఎస్ రద్దు చేసే అధికారం, అవకాశం మన రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. రాష్ట్ర శాసనసభలో నూతన పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం కొనసాగిస్తూ తీర్మానం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేద్దాం.

**అందుకు రాష్ట్ర వ్యాపితంగా అందరం కలిసి ఐక్యంగా పోరాటాలకు సిద్ధం అవుదాం. ఈ పోరాటాల్లో సిపిఎస్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు అందరూ చురుకుగా పాల్గొనాలి.**

మన పెన్షన్ హక్కును రద్దు చేసినదెవరో గుర్తించండి. మన భవిష్యత్‌ను కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెడుతున్న వారికి తగిన గుణపాఠం చెప్పాలి.

రాష్ట్ర స్థాయిలో మన సమస్యకు పరిష్కారం కోసం పోరాడుతూనే దేశ వ్యాపిత ఉద్యమాల్లో భాగస్వాములమవుదాం.

**"సిపిఎస్ రద్దు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలి"** అనే డిమాండ్‌తో జూన్ 19వ తేదీన విజయవాడలో జరిగే మహార్యాలీలో సిపిఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, యుటిఎఫ్ కార్యకర్తలు, ఉద్యమ అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం...

# ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్

తేది. 12. 06. 2016 రాష్ట్ర కమిటీ